# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఈరోజు ప్రవేశపెడతారు.**
2. **ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా ఈ రోజు గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెడతారు.**
3. **పోలవరం ప్రాజెక్టుకు ఎన్డీయే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **తెలంగాణ శాసనసభ సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభం కానున్నాయి.**
5. **జాతీయ ప్రసార దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

===========================

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు లోక్ సభ లో 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రవేశపెడతారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. వరుసగా ఏడు సార్లు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన మొదటి ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలవనున్నారు. మరోవైపు 2023-24 ఆర్థిక సర్వేను నిర్మలా సీతారామన్ నిన్న లోక్ సభ లో ప్రవేశపెట్టారు. సర్వేలో 2024-25 ఆర్థిక సంవత్సారానికి గాను దేశ వాస్తవ జీడీపీ 6.5 నుంచి 7 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేశామని అన్నారు. భౌగోళిక ఆర్థిక పనితీరు అస్థిరంగా ఉన్నప్పటికీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశీయ వృద్ధి ఆర్థిక వృద్ధికి మద్దతు ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ లో సులభతర వాణిజ్యంపై దాదాపు 11 దశల్లో చర్చలు జరిగాయని తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం రెండు బిల్లులను ప్రవేశపెట్టనుంది. భూహక్కు చట్టాన్ని రద్దు చేసే బిల్లును రెవెన్యూ, రిజిస్ట్రేషన్-స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టనున్నారు. విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్టీఆర్ పేరును తొలగించి వైఎస్సార్ పేరు పెడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన చట్ట సవరణను రద్దు చేస్తూ, రెండో బిల్లును వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రవేశపెట్టనున్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని రాయదుర్గం

శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు ప్రవేశపెట్టనున్నారు. దీనిపై పలువురు సభ్యులు మాట్లాడతారు. చివరగా ఈ తీర్మానంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమాధానం ఇవ్వనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం ప్రాజెక్టుకు ఎన్డీయే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పరిస్థితిపై కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మల నేతృత్వంలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ని కలిసి మంత్రి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలవరం తొలిదశ పనులను వేగంగా పూర్తి చేయడానికి 12 వేల 157 కోట్ల రూపాయల విడుదలకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. తొలిదశలో 41.15 మీటర్ల వరకు నీటిని నిల్వ చేసేందుకు వీలుగా ప్రాజెక్టు నిర్మాణం, పునరావాస పనుల పూర్తికి నిధులు విడుదల కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ (33 సెకన్లు)

---------------------------

తెలంగాణ శాసనసభ సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో ఈ రోజు సభ ప్రారంభం కాగానే.. దివంగత శాసనసభ్యురాలు లాస్య నందిత మృతికి సంతాపంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెడతారు. అనంతరం సభ వాయిదా పడుతుంది. బడ్జెట్ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై ఈ రోజు శాససభాపతి సమక్షంలో సభా వ్యవహారాల సలహా సంఘం –బీఏసీ సమావేశమవుతుంది. శాసనసభ నిర్వహణ తేదీలను, ఈ సమావేశంలో నిర్ణయిస్తారు.అలాగే 25న ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రి వర్గం సమావేశమై.. బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. అనంతరం తెలంగాణ శాసనసభలో ఆర్థికశాఖ మంత్రి భట్టివిక్రమార్క పూర్తిస్థాయి బడ్జెట్ ను ప్రవేశపెడతారు.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా నిన్న ముఖ్యమంత్రి కేంద్రమంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలోని మూసీనదిని శుభ్రం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద మూసీలో మురుగు నీరు శుద్ధి పనులకు 4 వేల కోట్ల రూపాయలను కేటాయించాలని కోరారు. హైదరాబాద్‌కు తాగునీరందించే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ను గోదావరి నీటితో నింపేందుకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి వివరించారమని తెలిపారు. తెలంగాణలో కొళాయిలు ఏర్పాటు చేసేందుకు జల్ జీవన్ మిషన్ నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

---------------------------

జాతీయ ప్రసార దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. మన దేశంలో ప్రప్రథమంగా రేడియో ప్రసారాలు 1927, జూలై 23వ తేదీన ముంబైలో ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా జూలై 23వ తేదీన జాతీయ ప్రసార దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద సమాచార వ్యవస్థగా ఆకాశవాణి వెలుగుందుతోంది. అనేక ప్రాంతీయ భాషల్లో

కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సాంస్కృతిక, ఆర్థిక సామాజిక అంశాలతో కూడిన కార్యక్రమాలను తనదైన శైలిలో ప్రజలు మెచ్చే రీతిలో ప్రసారం చేస్తోంది. అన్నిటికంటే.. ఆకాశవాణి విభిన్న భాషల్లో ప్రసారం చేసే జాతీయ, ప్రాంతీయ వార్తలు అత్యంత విశ్వసనీయమైనవిగా ప్రజాదరణ పొందుతున్నాయి. జాతీయ ప్రసార దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ప్రసారమవుతుంది.

---------------------------

వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను తెలంగాణ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలోని పెద్ద చెరువుకు గండి పడిన ప్రాంతాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద ఉధృతితో 400 ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందని, వాటిని తొలగించుకునేందుకు రైతులకు ఎకరాకు 10 వేల రూపాయల చొప్పున చెల్లిస్తామని అన్నారు. వరదల వల్ల దెబ్బతిన్న పంట నష్టాన్ని అధికారులతో అంచనా వేయించి నష్టపరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని రైతులందరికీ పంటల బీమా పథకం అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పంటల బీమాపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. పంటల బీమా అమలుపై మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, విపత్తు సమయాల్లో నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా బీమా విధానాలు అమలు చేయాలన్నారు. దిగుబడి, వాతావరణ ఆధారిత బీమా పథకాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మామిడికి కూడా బీమా వర్తింపజేయాలని చెప్పారు. పంటల బీమా అమలు, పరిహారం తదితర అంశాలపై ముఖ్యమంత్రికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

---------------------------

ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం బలహీనపడి తూర్పు మధ్యప్రదేశ్, పరిసర ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో కేంద్రీకృతమైందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మరికొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. రాగల మూడు రోజులపాటు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాద ఘటనపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరుపుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంత్రి

నిన్న అమరావతిలో  పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రమాద ఘటనకు సంబంధించి అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఆర్డీవో, తహసీల్దార్, ఉద్యోగుల ఫోన్లు సీజ్ చేశామని, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రెవిన్యూ కార్యాలయాల వద్ద భద్రతను మరింత పెంచామని మంత్రి వెల్లడించారు. మరోవైపు ఈ ఘటనపై ఇప్పటికే ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించడంతో  ఆంధ్రప్రదేశ్ డీజీపీ ద్వారకా తిరుమలరావు, నేర పరిశోధన విభాగం– సీఐడీ ఉన్నతాధికారి  రవిశంకర్ అయ్యన్నార్  మదనపల్లె చేరుకొని సంఘటనా స్థలాన్ని  పరిశీలించారు. ఆదివారం అర్ధరాత్రి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరగడంతో రెవెన్యూ రికార్డులు, కంప్యూటర్లు ఇతర సామగ్రి  దగ్ధమైయ్యాయి.

======================